ప్రజాశక్తి
మంగళవారం 21 నవంబరు 2023
5
శ్రీకాకుళం



తైక్వాండో రాష్ట్ర పోటీల్లో జిల్లా క్రీడాకారుల సత్తా

శ్రీకాకుళం : రాష్ట్రస్థాయి తైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు విజయబావుటా ఎగురవేశారు. పతకాల పంట పండించి సత్తా చాటారు. గుంటూరు జిల్లా తెనాలి వేదికగా ఈనెల 18, 19 తేదీల్లో రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొన్న జిల్లా క్రీడాకారులు మొత్తం 13 పతకాలు సాధించి శభాష్ అనిపించారు. ఇందులో నాలుగు స్వర్ణ, రెండు రజత, ఏడు కాంస్య పతకాలు ఉన్నాయి. ఈ పోటీలను ముగించుకుని జిల్లా క్రీడాకారుల బృందం సోమవారం జిల్లాకు చేరుకుంది. రాష్ట్రస్థాయి తైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు పతకాల పంట పండించడంపై ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, ప్రధాన కార్యదర్శి మెంటాడ సాంబమూర్తి, ముఖ్య సలహాదారు పి.సుందరరావు తదితరులు అభినందనలు తెలిపారు.



ఉపాధికేది భరోసా!

జిల్లాలో 193 కిలోమీటర్ల మేర విశాలమైన సముద్రతీరం ఉంది. ఖనిజ తవ్వకాలు, అణుపార్కు, పోర్టు నిర్మాణం పేరుతో తీరం ఒక్కొక్క ప్రాంతం కార్పొరేట్ పరమవుతోంది. దీనికితోడు రసాయనిక, కాలుష్య కారక పరిశ్రమలు సముద్రంలోకి విడుదల చేసే వ్యర్థాలతో మత్స్య సంపద క్షీణిస్తోంది. ఇది చేపల వేటపై తీవ్ర ప్రభావం చూపి మత్స్యకారుల వలసలకు దారితీస్తోంది. కార్పొరేట్లకు తీర ప్రాంత భూములను కట్టబెడుతున్న ప్రభుత్వం జెట్టీలు కడతాం, హార్బర్లు నిర్మిస్తామంటూ మత్స్యకారులను ఊరిస్తోంది. మరోవైపు కేంద్ర ప్రభుత్వం వారి సంక్షేమానికి ఉద్దేశించిన పథకాలకు సబ్సిడీని కుదిస్తోంది. మత్స్యకార దినోత్సవాలను ప్రతి ఏడాదీ నిర్వహిస్తూ తామే వారి సంక్షేమ కోసం పాటుపడుతున్నట్లు మాట్లాడుతున్న పాలకులు ఆనక వారి బాగోగులను గాలికొదిలేస్తున్నాయి.

- తీరంలో కొరవడిన మౌలిక వసతులు
- జిల్లాలో కోల్డ్ స్టోరేజీకి దిక్కులేని వైనం
- సంక్షేమ పథకాలకు సబ్సిడీ కుదించిన కేంద్రం
- నేడు ప్రపంచ మత్స్యకార దినోత్సవం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో 11 తీర ప్రాంత ప్రాంత మండలాల పరిధిలో 104 గ్రామాలున్నాయి. జిల్లాలో 1,46,192 మంది జనాభా, 46,580 కుటుంబాలు ఉన్నాయి. మూడు దశాబ్దాల కిందట వరకు ఇందులో 80 శాతం కుటుంబాలు చేపల వేటపై బతకగా, మిగిలిన 20 శాతం కుటుంబాలు వ్యవసాయం, ఇతర వృత్తులు, కూలి పనులు చేసుకునేవారు. ప్రస్తుతం మత్స్యకారుల జీవన స్థితిగతులన్నీ తారుమారు అయ్యాయి. ఇందులో చేపల వేటకు వెళ్తున్న వారి సంఖ్య 13 నుంచి 15 వేలు మాత్రమే ఉంది. చేపల వేట సరిగా సాగక వేలాది మంది మత్స్యకారులు గుజరాత్, తమిళనాడు, మహారాష్ట్ర, గోవా, కేరళ రాష్ట్రాలకు వలస వెళ్తున్నారు. అక్కడ బోటు యజమానుల వద్ద కూలీలుగా పనిచేస్తున్నారు. గుజరాత్‌లోని ఒక్క వీరావల్ ప్రాంతంలోనే జిల్లాకు చెందిన మత్స్యకారులు సుమారు మూడు వేల మంది ఉన్నారు. జిల్లాలోని తీర ప్రాంతంలో చేపలు దొరక్కపోవడంతో వేలాది మంది మత్స్యకారులు ఏకంగా చేపల వేట మానుకుని ఇతర వృత్తుల్లోకి వెళ్లిపోయారు. రోడ్డు వెంబడి టోపీలు, ఊయలలు అమ్ముకుని బతుకుతున్నారు. మరికొందరు పెయింటింగ్ పనులు చేస్తున్నారు. కొంతమంది గ్రామాల్లోనే ఉంటూ ఆటోలు, ప్రయివేట్ వాహనాలకు డ్రైవర్లుగా వెళ్తున్నారు. వేలాది మంది మత్స్యకారులు చేపల వేటకు దూరమవుతున్నారు.

ఫిషింగ్ హార్బర్ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన సాగరమాల ప్రాజెక్టుల్లో భాగంగా ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెంలో ఫిషింగ్ హార్బర్ నిర్మించాలని 2020లో నిర్ణయించారు. ఇందుకోసం రూ.365.81 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. కేంద్ర ప్రభుత్వం రూ.120 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం మిగిలిన డబ్బులను ఖర్చు చేయాల్సి ఉంటుంది. హార్బర్ నిర్మాణానికి 42 ఎకరాలు అవసరమవుతుందని అధికారులు గుర్తించారు. 2020లోనే భూసేకరణ పూర్తి చేశారు. ఇప్పటివరకు నిర్మాణానికి సంబంధించి ఒక్క అడుగూ పడలేదు.

తీర ప్రాంతాల్లో కొరవడిన మౌలిక వసతులు

జిల్లాలో మత్స్య సంపదను నిల్వ చేసేందుకు ఎక్కడా కోల్డ్ స్టోరేజీలు లేవు. ఎచ్చెర్ల మండలం డి.మత్స్యలేశం, రాళ్లపేటలో జెట్టీ, కవిటి మండలం ఇద్దివానిపాలెంలో జెట్టీ, సోంపేట మండలం బారువలో జెట్టీ, వజ్రపుకొత్తూరు మండలం నువ్వలరేవుల-మంచినీళ్లపేట జెట్టీ నిర్మాణం పనులు ముందుకు కదలడం లేదు. గతంలో బారువ, నువ్వలరేవు తదితర తీరాల్లో ఏర్పాటు చేసిన ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు అభివృద్ధికి నోచుకోవడం లేదు.

భారంగా చేపల వేట

జిల్లాలో మత్స్య సంపదను నిల్వ చేసేందుకు ఎక్కడా కోల్డ్ స్టోరేజీలు లేవు. పెరుగుతున్న డీజిల్ ధరలకనుగుణంగా సబ్సిడీ పెంచకపోవడంతో చేపల వేట మరింత భారంగా మారింది. ప్రధానంగా మెకనైజ్డ్, మోటరైజ్డ్ బోట్లకు వినియోగిస్తున్న డీజిల్ ధరలు విపరీతంగా పెరగడం ప్రధాన కారణమని తెలుస్తోంది. ప్రస్తుతం లీటర్ డీజిల్ ధర 98.97గా ఉంది. ప్రభుత్వం వీటికి లీటరుకు రూ.9 మాత్రమే ఇస్తోంది. అదీ నెలకు 300 లీటర్లను మాత్రమే ఇస్తోంది. డీజిల్ రూపంలో ఖర్చులు పెరగడంతో తమకు సగం కూడా మిగలడం లేదని మత్స్యకారులు చెప్తున్నారు. చేపలు దొరక్కపోతే ఒక్కోసారి డీజిల్ ఖర్చులూ రావడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు

సంక్షేమ పథకాలకు కేంద్రం సబ్సిడీ కుదింపు

ఫిషరీస్ డెవలప్‌మెంట్ స్కీమ్ ద్వారా కేంద్ర ప్రభుత్వం 75 శాతం రాయితీ ఇవ్వగా, కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు దాన్ని 40 శాతానికి కుదించింది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన ద్వారా ఎస్‌సి, ఎస్‌టి, మహిళలకు 60 శాతం, ఇతరులకు 40 శాతం మాత్రమే సబ్సిడీ అందిస్తోంది. ఆ పథకం కూడా మత్స్యకారులకు ఎందుకూ ఉపయోగపడడం లేదు. గతంలో వల యూనిట్ ఖరీదు రూ.రెండు లక్షలు ఉండగా, ప్రభుత్వం అందులో రూ.1.50 లక్షలు చెల్లించేది. మిగిలిన రూ.50 వేలు మత్స్యకారులు భరించేవారు. కేంద్ర ప్రభుత్వం ప్రస్తుత యూనిట్ ధరను రూ.ఐదు లక్షలు చేసింది. ఇందులో లబ్ధిదారుని వాటాగా మత్స్యకారులు రూ.మూడు లక్షలు చెల్లించాల్సి రావడంతో ఎవరూ ముందుకు రావడం లేదు. గతంలో బ్లూ రివల్యూషన్ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం 50 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం, లబ్ధిదారుడు 20 శాతం చెల్లించేలా మత్స్యకారులకు అమలు చేసిన పథకాన్ని ఆపేశాయి.



అన్నదాతల్లో గుబులు

జిల్లాలో పలుచోట్ల చిరుజల్లులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో జిల్లాలో పలుచోట్ల సోమవారం చిరుజల్లులు కురిశాయి. ఉదయం నుంచే వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. మబ్బులతో ఆకాశం మేఘావృతమైంది. సాయంత్రానికి కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు పడ్డాయి. ఇచ్ఛాపురం మండలం బొడ్డపడలో 1 మి.మీ, అరకభద్రలో 0.75 మి.మీ వర్షం నమోదైంది. టెక్కలి మండలం రావివలస, జలుమూరు, ఆమదాలవలస, ఎచ్చెర్లలో అర మి.మీ చొప్పున వర్షం కురిసింది. సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండలం నిమ్మాడ, కోటబొమ్మాళి తదితర ప్రాంతాల్లో చిరుజల్లులు కురిశాయి. వాతావరణం ఒక్కసారిగా మారడంతో అన్నదాతల్లో గుబులు రేగుతోంది. జిల్లాలో ఇప్పుడిప్పుడే వరి కోతలు మొదలవుతున్నాయి. బూర్జ, సారవకోట, జలుమూరు, నరసన్నపేట మండలాల్లో ఇప్పటికే నాలుగో వంతు కోతలు పూర్తయ్యాయి. కోసిన వరి పనలు పొలాల్లోనే ఉన్నాయి. కొందరు వాటిని కళ్లాలకు చేర్చి వాటిపై గడ్డి, టార్పాలిన్లు కప్పి కాపాడుకునే పనిలో నిమగ్నమయ్యారు. కొన్నిచోట్ల ఆదరాబాదరాగా నూర్పిడి చేసి ధాన్యాన్ని బస్తాల్లో నింపుతున్నారు. కోతలు, నూర్పిడి సమయంలో వర్షం కురిస్తే తమకు తీవ్ర నష్టం తప్పదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

దోచుకోవడం తప్ప చేసిందేమిటి?

చంద్రబాబుపై స్పీకర్ సీతారాం ధ్వజం

ప్రజాశక్తి - పొందూరు

మూడుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబునాయుడు ఆలీబాబా 40 దొంగల్లా రాష్ట్రాన్ని దోచుకోవడం తప్ప చేసిన అభివృద్ధి ఏమిటని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం విమర్శించారు. మండల కేంద్రంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆవరణలో జల జీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా రూ.ఐదు కోట్లతో ఇంటింటా మంచినీటి కుళాయిల ఏర్పాటుకు సోమవారం శంకుస్థాపన చేశారు. తోలాపిలో వై నీడ్స్ ఎపి జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు పరిపాలనలో ఎన్నో అవినీతి కుంభకోణాలు ఉన్నాయని ఆరోపించారు. టిడిపి హయాంలో విప్‌గా పనిచేసిన కూన రవికుమార్ నియోజకవర్గానికి ఏం చేశారని ప్రశ్నించారు.

జిల్లాలో రహదారుల కాంట్రాక్టుల పేరుతో అన్నదమ్ములు ఇద్దరూ దోచుకున్నారని ఆరోపించారు. రెల్లిగెడ్డ ఆధునీకరణ పేరిట రూ.కోట్ల నిధులను మంజూరు చేయించి పూర్తిస్థాయిలో ఖర్చు చేయకుండా, నాసిరకంగా పనులు చేయించడంతో నిర్మాణ దశలోనే అవి కొట్టుకుపోలేదా అని ప్రశ్నించారు. రవికుమార్ అవినీతి కారణంగా ఎనిమిది మంది ఇంజినీరింగ్ అధికారులు బలైపోయారని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్, ఎంపిపి ప్రతినిధి కిల్లి నాగేశ్వరరావు, పిఎసిఎస్ అధ్యక్షులు కె.రమణమూర్తి, ఎఎంసి చైర్మన్ బి.సునీల కుమార్, వైసిపి మండల, పట్టణ అధ్యక్షులు పప్పల రమేష్‌కుమార్, జి.నాగరాజు, జెసిఎస్ వెంకట కృష్ణారావు, వైస్ సర్పంచ్ అనకాపల్లి గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో అలసత్వం వద్దు

- రానున్న నెల రోజులు కీలకం : కలెక్టర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ఎన్నికల నిర్వహణకు సంబంధించిన విధుల్లో అధికారులు అలసత్వం వహించరాదని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ హెచ్చరించారు. రానున్న నెల రోజుల పాటు ఓటర్ల జాబితాకు సంబంధించిన పనుల్లో క్రియాశీలకంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఇఆర్ఒలు, తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లతో కలెక్టరేట్ నుంచి సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా 57 వేల మంది ఓటర్లు రెండేసి చోట్ల ఓట్లను కలిగి ఉన్నారని తెలిపారు. వారికి వెంటనే ఫారం-ఎ నోటీసును అందజేసి వారికి ఎక్కడ ఓటు హక్కు కావాలో 15 రోజుల్లోగా నిర్ధారించి క్లయిమ్‌ను పరిష్కరించాలని స్పష్టం చేశారు. నిర్ధారిత సమయంలోగా ఫారం-6 సహా అన్నిరకాల దరఖాస్తులను పెండింగ్ లేకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు. ఫొటోలు, చిరునామా తప్పుగా ఉన్న క్లయిమ్‌ల విషయంలో ఏమాత్రం అశ్రద్ధ వహించరాదని సూచించారు. పోలింగ్ కేంద్రాల వారీ దరఖాస్తుల పరిశీలన బూత్ లెవల్ ఆఫీసర్ ద్వారా పూర్తి చేయాలన్నారు. ఇఆర్ఒ దగ్గర మండలం వారీగా ఆ సమాచారం ఉండాలని చెప్పారు. బూత్ లెవల్ ఏజెంట్ దగ్గర పెండన్సీ ఉన్నట్లయితే స్వయంగా తహశీల్దార్లు సందర్శించి క్లయిమ్‌లను పరిష్కరించాల్సిందేనని స్పష్టం చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, అసిస్టెంట్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డిఆర్ఒ ఎం.గణపతిరావు తదితరులున్నారు.

పాలకుల వైఫల్యం వల్లే కరువు

- కరువు జిల్లాగా ప్రకటించాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు

ప్రజాశక్తి - నందిగాం, పలాస, రణస్థలం

జిల్లాలో నాగావళి, వంశధార, మహేంద్రతనయ, బాహుదా తదితర జీవనదులున్నా పాలకుల నిర్లక్ష్యం కారణంగా రైతాంగం ఏటా కరువుకు గురవుతోందని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు అన్నారు. పాలకుల వైఫల్యమే కరువుకు కారణమని విమర్శించారు. వర్షాభావ పరిస్థితులు, కాలువల ద్వారా సాగునీరందక పంటలు ఎండిపోయి కరువు పరిస్థితులు ఎదుర్కొంటున్న జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి, సహాయక చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నందిగాం, పలాస మండలాల్లోని వెంకన్నపేట, బోరుభద్ర, ఆనందపురం, మాదిగాపురం, కామధేనువు, లింగపురం, సవరలింగుపురం, సవరపడదాం తదితర గ్రామాల్లో పర్యటించి ఎండిన పంట పొలాలను పరిశీలించారు. వర్షాల్లేక పంటలు పూర్తిగా ఎండిపోయాయని చెరువులు, కుంటల్లో ఇంజిన్లు పెట్టి నీరు పెట్టడంతో పెట్టుబడి విపరీతంగా పెరిగినా, పంట చేతికి రాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వంశధార నదిపై నేరడి బ్యారేజీ నిర్మాణం చేపడితే ఇచ్ఛాపురం వరకు 2.50 లక్షల ఎకరాల వరకు సాగునీరు అందించవచ్చన్నారు. సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయడంలో పాలకుల నిర్లక్ష్యమే కరువుకు కారణమన్నారు. వంశధార కాలువ నిర్వహణకు నిధులు కేటాయించి ఖరీఫ్ సీజన్‌కు ముందే పనులు పూర్తి చేయాలని అనేకసార్లు ఆందోళన చేసినా ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. అధిక వడ్డీలకు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి పంట చేతికి రాక రైతులు తీవ్రంగా నష్టపోయి వలసలు పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర బృందం జిల్లాలో పర్యటించి కరువు సహాయక చర్యల కోసం నిధులు విడుదల చేయాలని, పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రెండో పంటకు స్వల్పకాలిక విత్తనాలు, ఎరువులు ఉచితంగా అందించాలని, ఉపాధి హామీ పనులు రెట్టింపు చేసి గ్రామాల్లోనే పనులు కల్పించాలని కోరారు. సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు తగిన నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎన్.షణ్ముఖరావు, పి.సాంబమూర్తి, బి.వాసుదేవరావు, హెచ్.ఈశ్వరరావు, కె.బాలాజీరావు, రైతులు సంపతిరావు, గోపాల్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

వర్షాభావం, తెగుళ్లతో పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం సత్వరమే ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి, కౌలురైతుల సంఘం జిల్లా అధ్యక్షులు వెలమల రమణ, సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు డిమాండ్ చేశారు. రణస్థలం మండలంలోని కొండములగాం, కమ్మసిగడాం, వేల్పురాయి, బంటుపల్లి, కంబాలపేటలో నీరు లేక ఎండిపోయిన, తెగుళ్ల సోకిన పంటలను, సాగు చేయకుండా ఉంచేసిన పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తోటపల్లి, మడ్డువలస ప్రాజెక్టులు ఉన్నా సాగునీరు ఇవ్వడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రభుత్వం గ్రామాన్ని యూనిట్ గా తీసుకుని సర్వే చేసి కరువు పరిస్థితి అంచనా వేయాలని డిమాండ్ చేశారు. ప్రత్యామ్నాయంగా రెండో పంటకు విత్తనాలు ఉచితంగా ఇవ్వాలన్నారు. రైతుల ఉత్పత్తులకు ఉత్పత్తి ఖర్చు, కుటుంబ శ్రమ విలువకు మరో 50 శాతం కలిపి కనీస మద్దతు ధర నిర్ణయించి అమలు చేయాలని డిమాండ్ చేసారు. అన్నిరకాల రుణాలను రద్దు చేసి కొత్త రుణాలు ఇవ్వాలన్నారు. ఉపాధి హామీ ద్వారా 200 రోజుల పని కల్పించి రోజుకు రూ.600 కూలి ఇవ్వాలని, పంటల బీమా రైతులందరికీ చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు దన్నాన అప్పలనాయుడు, రెడ్డి రామినాయుడు, కొంచాడ అప్పలనాయుడు, మజ్జి.రమణ తదితరులు ఉన్నారు.



నందిగాం : ఎండిన పంటలను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

విద్యా దీవెనకు జాయింట్ ఖాతా వద్దు

'స్పందన'లో ఎస్ఎఫ్ఐ వినతి

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి



వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు


జగనన్న విద్యా కానుక, వసతి దీవెన పథకాలకు జాయింట్ ఖాతా ఉత్తర్వులను రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షులు డి.చందు, శ్రీకాకుళం టౌన్ కమిటీ సభ్యులు నితిన్, జి.గోవర్ధన్ కోరారు. నగరంలోని జెడ్‌పి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 220 వినతులు వచ్చాయి. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అర్జీలను స్వీకరించారు. రెండు పథకాలకు ప్రారంభం నుంచి తల్లి ఖాతాలో నిధులు జమ చేస్తున్నారని, ఇప్పుడు జాయింట్ అకౌంట్ చేయడం వల్ల వచ్చే ప్రయోజనమేదీ కనిపించడం లేదన్నారు. పథకాల్లో కోత పెట్టేందుకే ప్రభుత్వం ఈ నిబంధన తీసుకొచ్చిందని తెలిపారు. పథకాల కింద చెల్లించాల్సిన రూ.1600 కోట్లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కోటబొమ్మాళిలో అంబేద్కర్ ఆడిటోరియం నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయాలని డా.బి.ఆర్ అంబేద్కర్ సేవా సమితి సభ్యులు బోకర జడ్డెన్న, శిమ్మయ్య, డి.సింహాచలం కోరారు. కొత్తూరు మండలంలో సుమారు 200 మంది కళాకారులు పలురకాల కళలు నేర్చుకోవడం, సాధన చేయడానికి మండల పరిధిలో కళాకారుల సామాజిక భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని కళాకారుల తరుపున అంపిలి ప్రశాంతకుమార్ కోరారు. కంచిలి మండలం పెద్ద శ్రీరాంపురంలో పోలింగ్ బూత్ నంబర్ 150లో 49, 151లో 29 మంది అర్హులైన ఓటర్లను తొలగించారని మాజీ సర్పంచ్ మాదిన రామారావు ఆధ్వర్యాన గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. పాతపట్నం మేజర్ పంచాయతీ అభివృద్ధి కోసం ఇస్తున్న నిధులను సక్రమంగా వినియోగించడం లేదని, గ్రామసభల్లో అధికారులు సరిగా సమాధానమూ చెప్పడం లేదని, దీనిపై సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని వైసిపి మండల నాయకులు బి.నారాయణమూర్తి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో సహాయ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, ప్రత్యేక ఉప కలెక్టర్ జి.జయదేవి, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, హౌసింగ్ పీడీ ఎన్.గణపతి, జిల్లా ఉద్యానవన అధికారి ఆర్.వి వరప్రసాదరావు, జిల్లా సరఫరాల అధికారి డి.వి రమణ తదితరులు పాల్గొన్నారు.

వైజాగ్-చెన్నై కారిడార్‌తో జిల్లాకు లబ్ధి

శ్రీకాకుళం : ఇచ్ఛాపురం వరకు వెళ్లే వైజాగ్-చెన్నై కారిడార్ నిర్మాణంతో శ్రీకాకుళం జిల్లా రూపురేఖలు మారనున్నాయని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. విశాఖ వేదికగా ఉత్తరాంధ్ర జిల్లాల నీతి ఆయోగ్ జి.హబ్ ప్రాంతీయ సమావేశంలో వర్చువల్‌గా కలెక్టరేట్ నుంచి సోమవారం పాల్గొన్నారు. జిల్లా అభివృద్ధికి తీసుకోగలిగే చర్యలపై చర్చలో ఆయన మాట్లాడారు. అపారమైన గ్రానైట్ నిల్వలు, 193 కిలోమీటర్ల సువిశాల సముద్రతీరం, 175 కిలోమీటర్ల జాతీయ రహదారి, ప్రధాన రైల్వే లైన్ కలిగి ఉండడం జిల్లా ప్రత్యేకత అని అన్నారు. జిల్లాలో పెద్దఎత్తున ఫార్మా పరిశ్రమల ఏర్పాటుకు, దేవాలయ పర్యాటకానికి అపార అవకాశాలు ఉన్నాయని చెప్పారు. అణువిద్యుత్కేంద్ర నిర్మాణంతో ప్రపంచ పటంలో జిల్లాలోని కొవ్వాడకు స్థానం లభిస్తుందని చెప్పారు. సువిశాలమైన సముద్రతీరంలో టూరిజం, జెట్టీలు, ఫిష్ లాండింగ్ సెంటర్లు నిర్మించడం ద్వారా మత్స్యకారుల వలసల నివారణ సాధ్యమవుతుందన్నారు. ప్రధానంగా వ్యవసాయంపై ఆధారపడుతున్న జిల్లా ప్రజలకు ఈ అపారమైన వనరులను అందించడం ద్వారా మెరుగైన జీవన ప్రమాణాలు మెరుగుపరచవచ్చని వివరించారు. నీతి ఆయోగ్ స్పెషల్ సెక్రెటరీ అనా రాయ్, స్టేట్ టాక్స్ కమిషనర్ గిరిజా శంకర్, నీతి ఆయోగ్ నేషనల్ అడ్వైజర్ పార్థసారథి రెడ్డి, మెకిన్సీ కంపెనీ ప్రతినిధులు అభిలేష్, వరల్డ్ రిసోర్స్ ఇన్స్టిట్యూట్ ప్రతినిధులు తదితరులు లేవనెత్తిన పలు అంశాలకు కలెక్టర్ బదులిచ్చారు. జిల్లా నుంచి ఈ సదస్సుకు ముఖ్య ప్రణాళిక అధికారి ఎస్.వి.ఎస్.ఎల్ ప్రసన్న, పర్యాటక అభివృద్ధి అధికారి ఎన్.నారాయణరావు, ఎపిఐఐసి జోనల్ మేనేజర్ బి.హరిదర్‌రావు, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ జె.ఉమామహేశ్వరరావు తదితరులు హాజరయ్యారు.

పోలీస్ స్పందనకు 40 వినతులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం



స్పందన కార్యక్రమంలో వచ్చే వినతుల పరిష్కారంలో జాప్యం ఉండరాదని ఎస్‌పి జి.ఆర్ రాధిక పోలీస్ అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 40 వినతులు వచ్చాయి. కుటుంబ తగాదాలకు సంబంధించి మూడు, మోసాలకు సంబంధించి ఐదు, ఆస్తి తగాదాలకు సంబంధించి 12, పాత ఫిర్యాదులు ఎనిమిది, ఇతర కారణాలతో 12 వినతులు వచ్చాయి. వినతులను స్వీకరించిన ఎస్‌పి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్పందన ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను వెంటనే ఎస్‌పి కార్యాలయానికి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఎఎస్‌పిలు టి.పి విఠలేశ్వర్, జె.తిప్పేస్వామి పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండడం ఎంతో అవసరమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. నగరంలోని ప్రభుత్వ ఐటిఐలో న్యాయ అవగాహనా సదస్సును సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టాలపై అవగాహన కలిగి ఉండడం ద్వారా అనవసరమైన తగాదాలకు దూరంగా ఉండవచ్చని చెప్పారు. ఆర్థిక స్తోమత లేని వారికి లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం ద్వారా ఉచితంగా కేసులు నడిపిస్తారని తెలిపారు. విద్యార్థులు లోకాయుక్త పైనా అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగి విధులు సక్రమంగా నిర్వహించకపోతే లోకాయుక్తకు ఫిర్యాదు చేయొచ్చని చెప్పారు. కార్యక్రమంలో న్యాయవాది గేదెల ఇందిరా ప్రసాద్, సామాజిక కార్యకర్త మంత్రి వెంకటస్వామి, కళాశాల ట్రైనీ ఆఫీసర్ ఎన్.లక్ష్మణరావు, డిప్యూటీ ట్రైనింగ్ ఆఫీసర్ ఎస్.గోవిందరావు, ట్రైనింగ్ ఆఫీసర్ ఎం.మురళీకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు



టెక్కలి : మెమొంటోను అందజేస్తున్న సబ్ కలెక్టర్ నూరుల్ కమర్



శ్రీకాకుళం : మాట్లాడుతున్న సువర్ణ



పోలాకి : బహుమతులను అందజేస్తున్న జెడ్‌పిటిసి కృష్ణచైతన్య

ప్రజాశక్తి- టెక్కలి/టెక్కలి రూరల్

యువతకు దేశ భవిష్యత్ మార్గాల సామర్థ్యాలు ఉండాలని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. స్థానిక డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గోవిందమ్మ అధ్యక్షతన 56 గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు భాగంగా సోమవారం కీర్తిశేషులు కొర్ల రేవతి మెమోరియల్ ఛారిటబుల్ ట్రస్టు ద్వారా (గ్రూప్స్) పబ్లిక్ సర్వీసెస్ పోటీకి సిద్ధమవుతున్న విద్యార్థులకు పుస్తకాలను అందజేశారు. అలాగే వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, టెక్కలి నియోజకవర్గం సమన్వయకర్త దువ్వాడ వాణి, మాజీ ఎమ్మెల్యే కొర్ల భారతి, కొర్ల రేవతి మెమోరియల్ ఛారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఎస్.శిరీష, శ్రీనివాసరావు, దువ్వాడ హైందవి, ఎంపిపి అట్ల సరోజనమ్మ, గండి అప్పలరెడ్డి, హనుమంతు ఉదయభాస్కరరావు పాల్గొన్నారు.

శ్రీకాకుళం: విద్యార్థి దశ నుంచే గ్రంథాలయాలపై అవగాహన కలిగి ఉండాలని గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సువ్వారి సువర్ణ అన్నారు. నగరంలోని జిల్లా గ్రంథాలయంలో డిప్యూటీ లైబ్రేరియన్ వి.వి.జి.ఎస్.శంకరరావు అధ్యక్షతన సోమవారం నిర్వహించిన ముగింపు గ్రంథాలయ వారోత్సవాల్లో పాల్గొన్నారు. వారం రోజుల పాటు నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు గ్రంథాలయ కార్యదర్శి బి.కుమార్‌రాజుతో కలసి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ప్రతినిధి సత్యనారాయణ, సోదవరం ఈశ్వరరావు, ఫిల్మోజీ సంగీతం డైరెక్టర్ నవీన్, కె.లక్ష్మణ్, అసిస్టెంట్ లైబ్రేరియన్ ఎస్.వి. రమణమూర్తి పాల్గొన్నారు.

నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల పురుషుల గ్రంథాలయంలో వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ, వైస్ ప్రిన్సిపాల్ ఎం.వి.సత్యనారాయణ, ఐక్యూఎసి కో-ఆర్డినేటర్ హరిత, గ్రంథాలయ కమిటీ సభ్యులు డాక్టర్లు సూరిబాబు, రాంబాబు, పి.వి.రమణ, తెలుగు అధ్యాపకులు పి.నారాయణరావు పాల్గొన్నారు.

నందిగాం: స్థానిక గ్రంథాలయాధికారి ఉదయ్‌కిరణ్ అధ్యక్షతన నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి, సర్పంచ్ జడ్డాడ జయరాం, ఎంపిటిసి అంబటి విష్ణు, ప్రధానోపాధ్యాయులు హరిబాబు, రాము పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు.

మెళియాపుట్టి: స్థానిక గ్రంథాలయంలో వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఎంఇఒ పి.చంద్రశేఖర్ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఆర్.అనురాధ, ఇఒపిఆర్‌డి తారకేశ్వర్, ఎంఇఒలు దేవేంద్రరావు, పద్మనాభం, ప్రతాప్, గణపతిరావు, తనూజ, శ్వేత, భాస్కరరావు, పండు, రాజీ పాల్గొన్నారు.

ఎచ్చెర్ల : ధర్మవరం గ్రంథాలయంలో టికె ఆచారి అధ్యక్షతన నిర్వహించిన ముగింపు వారోత్సవంలో కొయ్యాం జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ తవిటినాయుడు, సర్పంచ్ అల్లు కన్నబాబు, ఎంపిటిసి బగ్గు రాజారావు, అసిరితల్లి యువజన సంఘం అధ్యక్షులు రుప్ప లక్ష్మణరావు, పాఠశాల హెచ్‌ఎం హరికృష్ణ మిథుల విద్యాలయం కరస్పాండెంట్ జయరాం, గ్రంథాలయ అధికారి మల్లిపెద్ది చంద్రశేఖర్, సహాయకులు సూర్యనారాయణ, యువజన సంఘ సభ్యులు మహేష్ పాల్గొన్నారు. ప్రసాద్ మ్యాజిక్ షో నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు.

ధర్మవరం శాఖా గ్రంథాలయాధికారిగా పనిచేస్తున్న మల్లిపెద్ది చంద్రశేఖరరావుకు వారోత్సవాల సందర్భంగా జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఉత్తమ గ్రంథ పాలకుడుగా ఘనంగా సన్మానం చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షురాలు సువర్ణ, బి.కుమార్ రాజు, చైర్‌పర్సన్ ప్రతినిధి ఎస్.సత్యనారాయణ, డిప్యూటీ లైబ్రేరియన్ శంకరరావు శాలువతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు.

పోలాకి : స్థానిక శాఖాగ్రంథాలయంలో మౌలిక వసతులు కల్పనకు నిధులు మంజూరు చేస్తానని జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణచైతన్య హామీనిచ్చారు. గ్రంథాలయ వారోత్సవాల్లో పోటీని విజేతలకు బహుమతులను అందజేశారు. గ్రంథాలయానికి ఆనించి ఉన్న ఖాళీ స్థలం ఆక్రమణకు గురవుతుందని, ప్రహరీ నిర్మించాలని గ్రంథాలయాధికారిని కె.మానస జెడ్‌పిటిసి దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి ముద్దాడ బైరాగినాయుడు, సర్పంచ్ మజ్జి రమణమ్మ, ప్రతినిధి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : గ్రంథాలయంలో వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి పూర్ణచంద్ర బెహరా, ప్రభుత్వ ఉన్నత ప్రధానోపాధ్యాయులు విశ్వనాథ్, ఆరిసిగోరేశంకరరెడ్డి, ఈశ్వరి, పీడీ గణేష్ పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : గ్రంథాలయంలో వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు వజ్రపుకొత్తూరు సర్పంచ్ ప్రతినిధి పి.గురయ్య నాయుడు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ బి.అప్పలస్వామి, ఎంపిడి స్కూల్ ఉపాధ్యాయులు, దోకులపాడు సర్పంచ్ ప్రతినిధి వడ్డి కరుణాకర్ పాల్గొన్నారు.

టెక్కలి రూరల్: గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలని టెక్కలి నియోజకవర్గం సమన్వయకర్త దువ్వాడ వాణి అన్నారు. స్థానిక శంభానవీధిలో శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి బి.రావు అధ్యక్షతన నిర్వహించిన ముగింపు గ్రంథాలయ వారోత్సవంలో పాల్గొని విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ చింతాడ లక్ష్మీబాయి, ఎంపిపి అట్ల సరోజనమ్మ, ఎంపిటిసి కూన పార్వతి, నూనెల సోమేశ్వరరావు, గండి అప్పలరెడ్డి, దవళ కుసుడు పాల్గొన్నారు.

నౌపడ : నౌపడ శాఖాగ్రంథాలయంలో ముగింపు వారోత్సవంలో సర్పంచ్ బృందాదేవి, ప్రతినిధి రవికుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు ప్రేమకుమారి, గ్రంథాలయాధికారి బి.రూపావతి పాల్గొని విజేతలకు బహుమతులను అందజేశారు.

కొత్తూరు : గ్రంథాలయాధికారి టి.ఇందిర ఆధ్వర్యాన నిర్వహించిన ముగింపు వారోత్సవంలో విజేతలకు సర్పంచ్, ఎంపిటిసిలు పడల కృష్ణవేణి, గండివలస రత్నకుమారిలు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.నారాయణరావు, ఎం.రాంబాబు, ఎ.శ్రీరాములు, పి.శివకుమార్, రామకృష్ణ, డి.లక్ష్మి పాల్గొన్నారు.

సంతబొమ్మాళి : స్థానిక గ్రంథాలయంలో నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో జెడ్‌పిటిసి పాల వసంతరెడ్డి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో మేధావుల సంఘం అధ్యక్షులు వెంకటేశ్వరరావు, ఎంపిడిఒ ప్రేమలీల, గ్రంథాలయాధికారి రామకృష్ణ, ఎంఇఒలు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

పలాస : స్థానిక గ్రంథాలయంలో వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల విజేతలకు ఎంఇఒ శ్రీనివాసరావు, సత్యంలు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి వై.రాంబాబు పాల్గొన్నారు.

మందస : మందస గ్రంథాలయంలో వివిధ రకాల పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను సర్పంచ్ ప్రతినిధి లక్ష్మణరావు, షిరిడి సాయి సేవా సంఘం అధ్యక్షులు గిన్ని తిరుపతిరెడ్డి, గ్రంథాలయ అధికారి విజయలక్ష్మి, మోహన్, కోటేశ్వరరావు బహుమతులను అందజేశారు.

లావేరు: స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఎంఇఒ లండ ఈశ్వరరావు పాల్గొన్నారు. విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఎ. పద్మావతి సుమారు రూ.5వేలు విలువ గల పోటీపరీక్ష పుస్తకాలను గ్రంథాలయానికి ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ముదపాక శ్రీనివాసరావు, బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ ఎ.లక్ష్మి, యోగ టీచర్స్ భగవాన్, లక్ష్మణరావు, గ్రంథాలయ సహాయకులు జి. గడ్డియ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

జి. సిగడాం: స్థానిక శాఖా గ్రంథాలయంలో వారోత్సవాలు గ్రంథాలయ అధికారి సిహెచ్ వెంకటేష్ ఆధ్వర్యంలో ఘనంగా ముగింపు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి మీసాల వెంకటరమణ, కెజిబివి స్కూల్ ప్రిన్సిపాల్ ఉషా రత్నకుమారి, జెడ్‌పిటిసి కాయల రమణ, విఆర్ఒ నర్సింగరావు, ఎంపిటిసి కీర్తి సత్యం, సర్పంచ్ ప్రతినిధి గౌరీశ్వర్, మోడల్ స్కూల్ లైబ్రేరియన్ లక్ష్మణరావు, గ్రంథాలయ సిబ్బంది ఎన్.దుర్గారావు, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎచ్చెర్ల : మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ తవిటినాయుడు



జి.సిగడాం : బహుమతులను ప్రదానం చేస్తున్న వెంకటరమణ



సంతబొమ్మాళి : బహుమతులను అందజేస్తున్న వసంతరెడ్డి

పొందూరు: స్థానిక శాఖా గ్రంథాలయంలో వారోత్సవాలు ముగిసినట్లు గ్రంథాలయాధికారి సిహెచ్ వెంకటేష్ తెలిపారు. వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మేజర్ పంచాయతీ సర్పంచ్ రేగడి లక్ష్మి, రెడ్‌క్రాస్ సభ్యులు కాళ్లకూరి శాంతారాం, సాహితీవేత్త జి.ప్రభాకరరావు, సవరభాష ఆధునీకరణ రచయిత డా.ఎ.చంద్రశేఖర్, విశ్రాంత ఉపాధ్యాయులు గోవిందరావు పాల్గొన్నారు.

కుల గణన బాధ్యతగా చేపట్టాలి

ప్రజాశక్తి- లావేరు

మండలంలో 27 నుంచి గ్రామాల్లో చేపట్టబోయే సామాజిక కులగణన బాధ్యతగా చేపట్టాలని ఎంపిడిఒ కుప్పిలి సురేష్‌కుమార్ అన్నారు. సోమవారం మండల పరిషత్ సమావేశమందిరంలో కులగణనపై పంచాయతీ నుంచి కార్యదర్శి, వెల్ఫేర్ అసిస్టెంట్‌కు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులగణనలో సిబ్బంది ఎటువంటి పొరపాట్లు దొర్లకుండా చేపట్టాలన్నారు. తహశీల్దార్ సాధు దిలీప్‌చక్రవర్తి మాట్లాడుతూ సమస్యలపై అనుమానాలుంటే మండల అధికారులతో సంప్రదింపులు చేసి ప్రభుత్వ విధివిధానాలను అనుసరించాలన్నారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనీ బాలచందర్ సిబ్బందికి శిక్షణలో నమోదు వివరాలపై వివరించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి విశ్వేశ్వరరావు, కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిడిఒ సురేష్ కుమార్

నైపుణ్యాలు పెంచుకోవాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం

విద్యార్థి దశనుంచే నైపుణ్యాలు పెంచుకోవాలని అంబేద్కర్ యునివర్సిటీ కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ జి.రామకృష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.వి.వేణుగోపాల్, వైస్ ప్రిన్సిపాల్ డి.విక్రమ్ అన్నారు. స్థానిక ఆర్ట్స్ కాలేజీ రోడ్‌లో కాకినాడ శ్రీ ఆదిత్య డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో టెక్‌ఫెస్ట్ ఐథాన్-2023 ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్ మాట్లాడుతూ విద్యార్థి దశలో నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగడతాయన్నారు. విద్యార్థులు కళాశాలలో చెప్పే అంశాలను ప్రాక్టికల్‌గా అమలు చేస్తే అత్యుత్తమ శిఖరాలను అధిరోహించవచ్చున్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ చక్రవర్తి, కళశాల కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి జిజివి. సుబ్రహ్మణ్యం, అధ్యాపక బృందం ఎస్.రాజు, బిడిఎస్.కిశోర్, టి.ప్రశాంతి తదితరులు ఉన్నారు.



బహుమతులను అందజేస్తున్న రామకృష్ణ తదితరులు

భూతగాదాలో అన్నదమ్ముల కొట్లాట

బూర్జ: మండలంలో కొమ్మువలస గ్రామంలో ఆదివారం జరిగిన భూతగాదాకు సంబంధించి పంట పొలాల్లో అన్నదమ్ముల మధ్య గొడవలు జరిగినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం రెవెన్యూ పరిధిలో ఉన్న భూములకు సంబంధించి కొమ్మువలస గ్రామానికి చెందిన అన్నదమ్ములు గండివలస శేషగిరిరావు, గండివలస వెంకటరావు, గండివలస ఎరుక నాయుడు మధ్య ఈ గొడవలు జరిగాయి. చిలికి చిలికి గాలివానలా మారి కొట్లాటకు దారి తీశాయి. ఈ కొట్లాటలో పలువురు గాయపడ్డారు. వీరు ప్రస్తుతం పాలకొండ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఎస్‌ఐ అశోక్‌బాబు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేపు పినకాన వర్ధంతి సభ

నందిగాం : ఈ నెల 22న పోరాట యోధుడు కామ్రేడ్ పినకాన కృష్ణమూర్తి 7వ వర్ధంతి సభ మండలంలోని చిన్నలక్ష్మీపురం జంక్షన్ స్థూపం వద్ద ఉదయం 10 గంటలకు వర్ధంతి సభ నిర్వహిస్తున్నట్లు సిపిఎం నాయకులు ఎన్.షణ్ముఖరావు, ఈశ్వరరావు, బి.వాసుదేవరావు ఒక ప్రకటనలో తెలిపారు. రైతాంగ పోరాటంలో కీలకపాత్ర పోషించారని అన్నారు. కష్టజీవుల పక్షాన కడవరకు పోరాటం చేసిన యోధుడు కృష్ణమూర్తి అని అన్నారు. మండలంలోని రైతులు రైతు, కూలీలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పరిశోధనాత్మక పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జగదీశ్వరరావు తదితరులు

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

రాజీవ్‌గాంధీ సాంకేతిక విశ్వవిద్యాలయం, శ్రీకాకుళం ఆంగ్ల అధ్యాపకుడు రాకోటి శ్రీనివాసరావు రచించిన 'ఎ క్రిటికల్ ఎనాలసిస్ ఆఫ్ హ్యూమన్ ఫైడికమెంట్ ఇన్లా సెలక్ట్ నావల్స్ ఆఫ్ చమన్- 'సహల్' పరిశోధనాత్మక గ్రంథాన్ని ట్రిపుల్ ఐటి డైరెక్టర్ పి.జగదీశ్వరరావు, ఒఎస్‌డి సుధాకర్‌బాబు సోమవారం ఆవిష్కరించారు. సహ రచయితగా జెఎన్‌టియు అనంతపురం ఆంగ్ల ఆచార్యులు వి.బి చిత్ర గ్రంథ రచనలో సహకరించారు. విద్య, పరిశోధనా రంగాల్లో శ్రీనివాసరావు చేస్తున్న కృషిని అభినందించారు. కార్యక్రమంలో ఎఒ ముని రామకృష్ణ, డీన్ కె.ఎం.కె చౌదరి, ఎఫ్ఒ చల్లా అసిరినాయుడు, డీన్ వెల్ఫేర్ జి.రవి, ఆంగ్ల విభాగాధిపతి విశ్వనాథ్ పాల్గొన్నారు.

తహశీల్దార్ ఎదుటే బాహాబాహీ

ప్రజాశక్తి- టెక్కలి

మండలంలోని పరశురాంపురం వద్ద నున్న పంట పొలాల ఆక్రమణ విషయంలో ఇరు గ్రూపులకు చెందిన వారు తహశీల్దార్ కురమాన ప్రవల్లిక ప్రియ ఛాంబర్‌లోనే సోమవారం బాహాబాహి చోటు చేసుకుంది. సర్వే నంబరు 42లో పన్నెండులో ఉన్న 59 సెంట్లు స్థలం కొద్ది రోజులుగా వివాదంగా మారింది. గ్రామానికి చెందిన దివాకర్‌మిశ్రో, భక్తవత్సల మహాపాత్రోల మధ్య వివాదం నడుస్తుంది. ఈ సమస్య పరిష్కారానికి తహశీల్దార్ ఇరు గ్రూపుల వారిలో హియరింగ్ ఏర్పాటు చేశారు. సదరు సర్వే నంబరులోని 59 సెంట్లు భూమికి తామే హక్కుదారులమని, తమకంటే తమకే చెల్లుతుందని ఇరు గ్రూపుల వాదనకు దిగారు. అయితే రెవెన్యూ రికార్డుల్లో రికార్డుల్లో మాత్రం సదరు భూమి గోవింద్ పాత్రో పేరుతో ఉండడంతో ఆయన వంశీకులు తామేనని దివాకర్ మిశ్రో చెప్పాడు. దీంతో గోవింద్ పాత్రో ఆనే వ్యక్తి తమ వంశీకుడేనని భక్తవత్సల మహాపాత్రోకు చెందిన గ్రూపు సభ్యులు వాదించారు. ఈ నేపథ్యంలో మాటామాటా పెరిగి బాహాబాహికి పాల్పడ్డారు. ఒకానొక దశలో పెద్దమనిషిగా వచ్చిన సర్పంచ్ కె.కామేశ్వరరావుపైనా ఒక గ్రూపు చెందిన వారు దాడి చేయడానికి యత్నించడం గమనార్హం. వివాదం తీవ్ర దశకు చేరుతుండడంతో రెవెన్యూ సిబ్బంది రికార్డులను పరిశీలించారు. గోపాలకృష్ణ మిశ్రో అని ఉండడంతో సదరు వ్యక్తి వంశీకులు ఎవ్వరో తేల్చుకుని రావాలని తహశీల్దార్ చెప్పారు. దీంతో ఇరు గ్రూపులకు చెందిన వారు మౌనం దాల్చి వెళ్లిపోయారు.

టిడిపి నాయకుల సంబరాలు



ఇచ్ఛాపురం : బాణసంచా కాల్చుతున్న టిడిపి నాయకులు

టెక్కలి : టెక్కలిలో టిడిపి నాయకులు బాణసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు బగాది శేషగిరి, హనుమంతు రామకృష్ణ, మెండ దమయంతి, మామిడి రాము, రెయ్యి ప్రీతీష్‌చంద్, కోళ్ల లవకుమార్, బెహరాకాళీ, గండి చంద్రరావు, సోడిమూడి కిరణ్‌కుమార్, మల్లిపెద్ది మధు, కోళ్ల కామేష్ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : బాబుకు బెయిల్ మంజూరు కావడంతో స్థానిక బస్టాండ్ వద్ద టిడిపి నాయకులు బాణసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నేతలు కాళ్ల ధర్మారావు, నందిక జాని, కొండ శంకర్‌రెడ్డి, పద్మనాభం, కాళ్ల దిలీప్, కాళ్ల జయదేవ్, జన్నెల సంతోష్, కోటి, కామేశ్వరరావు, లోహిదాస్, కాళ్ల గోపి పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: చంద్రబాబుకు బెయిల్ మంజూరు కావడంతో టిడిపి నాయకులు బాణసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు బోయిన గోవిందరాజులు, టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు బోయిన రమేష్, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్, మాజీ ఎంపిపిలు తర్ర రామకృష్ణ, వెలమల విజయలక్ష్మి, కామేశ్వరరావు, టెక్కలి నియోజకవర్గ మహిళా అధ్యక్షులు పూజారి శైలజ, నాయకులు నంబాళ శ్రీనివాస్, గొండు లక్ష్మణరావు, కర్రి అప్పారావు, బెండి అన్నపూర్ణ పాల్గొన్నారు.

ఆమదాలవలస: టిడిపి జాతీయ అధ్యక్షుడు, మాజీ సిఎం నారా చంద్రబాబు నాయుడుకు రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం పూర్తిస్థాయి బెయిల్ మంజూరు చేయడంతో టిడిపి నాయకులు జూనియర్ కాలేజీ వద్ద బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకుడు తమ్మినేని విద్యాసాగర్, జిల్లా డాక్టర్ల కన్వీనర్ చాపర సుధాకర్ పాల్గొన్నారు.



కోటబొమ్మాళి : బాణసంచా కాల్చుతున్న నాయకులు

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

పిసిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు బొడ్డేపల్లి సత్యవతి



సమావేశంలో మాట్లాడుతున సత్యవతి

ప్రజాశక్తి- ఆమదాలవలస


ప్రజా సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని పిసిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు బొడ్డేపల్లి సత్యవతి అన్నారు. సోమవారం ఆమె స్వగృహంలో జిల్లా డిసిసి అధ్యక్షులు పేడాడ పరమేశ్వరరావు అధ్యక్షతన నియోజకవర్గంలోని మండల అధ్యక్షులు, కమిటీల నియామకంపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజల సమస్యలను కాంగ్రెస్‌పార్టీ దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి తగినచర్యలు తీసుకుంటామన్నారు. శాసనసభ ఎన్నికల నాటికీ వివిధ పార్టీలు చక్కెర కర్మాగారం అంశాన్ని ప్రస్తావించి ఎన్నికల తర్వాత విస్మరిస్తున్నారన్నారు. కొందరు నేతలు చక్కెర కర్మాగార స్థలాన్ని రియల్ ఎస్టేట్ చేసేందుకు పావులు కదుపుతున్నారన్నారు. డిసిసి అధ్యక్షులు పేడాడ పరమేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో ఆమదాలవలస చక్కెర కర్మాగారాన్ని నేటి పాలక, ప్రతిపక్షాలు విస్మరించి దోచుకోవాలని చూస్తున్నాయని ధ్వజమెత్తారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ ఆమదాలవలస మండల అధ్యక్షునిగా బొడ్డేపల్లి గోవింద గోపాల్, సరుబుజ్జిలి మండల అధ్యక్షునిగా బొడ్డేపల్లి కోదండరావు, బూర్జ మండల అధ్యక్షుడుగా పప్పల వెంకటరమణ, పొందూరు మండల అధ్యక్షుడిగా పైడి రమణారావులను ఏకగ్రీవ తీర్మానంతో ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సనపల అన్నాజీరావు, బసవ షణ్ముఖరావు, కె.ఈశ్వరి, తెంబూరు మధు, లఖినేని సాయిరాం, బొత్స రమణ, దాలయ్య సనపల వాసుదేవరావు, పప్పల అప్పారావు, అప్పారావు, రామారావు, రాజారావు పాల్గొన్నారు.

సదస్సును విజయవంతం చేయాలి

కొత్తూరు: ఈ నెల 22న విశాఖపట్నం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం వద్ద దళిత హక్కుల రక్షణ రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నామని, దళితులు పాల్గొని విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిర్ల ప్రసాద్, గంగరాపు సింహాచలం పిలుపునిచ్చారు. కొత్తూరు సోమవారం విలేకరులతో మాట్లాడారు. మనువాద, మతోన్మాద బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత దళిత, గిరిజన,ముస్లిములు, క్రిస్టియన్లపై దాడులు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సదస్సుకు జాతీయ నాయకులువి.వెంకటేశ్వర్లు, వి.శ్రీనివాసరావు, బి.వెంకటరావు, మల్లేపల్లి పాల్గొంటారని తెలిపారు.



మాట్లాడుతున్న ప్రసాద్



మాట్లాడుతున్న డిఎల్‌పిఒ రమణ

ఇంటి పన్ను వసూలు వేగవంతం

నౌపడ: సంతబొమ్మాళి మండలం నౌపడ మేజర్ పంచాయతీలో ఇంటి పన్ను వసూలను వేగవంతం చేయాలని డిఎల్‌పిఒ ఐ.వి.రమణ ఆదేశించారు. నౌపడా సచివాలయంలో పన్ను వసూలు రికార్డును సోమవారం పరిశీలించారు. ఈ ఏడాదికి రూ.7.50 లక్షలు వసూలు చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు రూ.73,373 వసూలైందని అన్నారు. త్వరితగతిన ఇంటి పన్ను వసూలకు చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శి ఎం.రవి, రంజిత్‌ని ఆదేశించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చెలరేగిపోతున్న దొంగలు

బూర్జ: మండలంలో వావాం, కాఖండ్యాం, చిన్న లంకాం, పిఎల్ దేవిపేట గ్రామాల్లో రైతుల పంట పొలాల్లో ఉండే ఆయిల్ ఇంజిన్లు, మినీట్రాక్టర్లను దుండగులు దోచుకుంటున్నారు. ఇప్పటికే రైతులకు సంబంధించి సుమారు రూ.5 లక్షల వరకు పలు పరికరాలు ఉంటాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి దొంగతనాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని మండల రైతులు కోరుతున్నారు.

సంక్షిప్త వార్తలు

ట్రస్టు సేవలు విస్తృతం

టెక్కలి రూరల్ : విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలను కల్పించడమే ట్రస్టు ముఖ్య ఉద్దేశమని కీర్తిశేషులు డాక్టర్ కొర్ల రేవతీపతి మెమోరియల్ ఛారిటబుల్ ట్రస్టు చైర్మన్ చిగురుపల్లి శిరీష శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం విలేకరులతో మాట్లాడారు. టెక్కలికి ప్రాధాన్యత ఇస్తూ శ్రీకాకుళం, పలాస పరిసర ప్రాంతాల్లో ఈ టెస్టు ద్వారా సేవలు విస్తృతం చేస్తామని అన్నారు. పేద విద్యార్థుల నైపుణ్యాన్ని గుర్తించి గ్రూప్స్ కోచింగ్ పంపించే ఖర్చులూ ట్రస్టు భరిస్తుందని చెప్పారు. వెనుకబడిన ప్రాంతాలను గుర్తించి వైద్యం అందించే దిశగా కృషి చేస్తామని అన్నారు. నైపుణ్యాన్ని గుర్తించి ఉపాధి కల్పన దిశగా కృషి చేస్తామని తెలిపారు.

స్థలం కేటాయింపుపై హర్షం



అన్వేష్

ఇచ్ఛాపురం : క్రిస్టియన్ మైనారిటీ సామాజిక భవన నిర్మాణానికి స్థలం కేటాయింపుపై జిల్లా క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు ప్రత్తి అన్వేష్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఇచ్ఛాపురం నియోజికవర్గ కేంద్రం సామాజిక భవన నిర్మాణానికి స్థలం కోసం ఎంతో కాలంగా ఎదురు చూస్తున్నామని అన్నారు. ఈ సమయంలో జగనన్న కాలనీ సమీపంలో సామాజిక భవన నిర్మాణానికి స్థలం కేటాయింపు చేయడం హర్షనీయమని అన్నారు. ఈ స్థలం మంజూరుకు రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు, జెడ్పి చైర్‌పర్సన్ పిరియా విజయ, వైపిపి ఇచ్ఛాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పిరియా సాయిరాజ్, మున్సిపల్ చైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మి, కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ కృషి చేశారని తెలిపారు. వీరికి కృతజ్ఞతలు తెలిపారు.

క్రీడాకారునికి అభినందనలు

టెక్కలి : ఈ నెల 22, 23 తేదీల్లో కర్నూలులో జరగనున్న రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో టెక్కలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి చక్రపాణి పాల్గొంటారని హెచ్‌ఎం దాసరి నాగభూషణం తెలిపారు. ఈ మేరకు చక్రపాణికి సోమవారం అభినందించారు. విద్యార్థి ఎంపికకు కృషి చేసిన వ్యాయయ ఉపాధ్యాయులు కె.కె.రామరెడ్డి, జగ్గమ్మ పాల్గొన్నారు.

ఘనంగా దివస్ వేడుకలు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని పెద్దమడి ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో సోమవారం జాతీయ గౌరవ దివస్ వేడుకలు నిర్వహించారు. బ్రిటిష్ వలసవాదం, దోపిడీకి వ్యతిరేకంగా ఉద్యమించిన గిరిజన యోధుడు బిర్సా ముండా జయంతి పురస్కరించుకుని గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల స్మారకార్థం వారం రోజులు పాటు నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపిపి ఎస్.ఆదినాయుడు మొక్కలను నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ గౌరవం, పరాక్రమం, ఆతిథ్యం వంటి భారతీయ విలువలను పెంపొందించడం, సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడడంలో గిరిజనుల చేస్తున్న కృషిని గుర్తు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తెంబూరు ప్రసాదరావు, వైస్ సర్పంచ్ సవర రమేష్, వార్డు మెంబర్లు సవర నరేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శారద పాల్గొన్నారు.



మొక్కను నాటుతున్న వైస్ ఎంపిపి ఆదినాయుడు

బహిరంగ సభతో ప్రయాణికుల అవస్థలు



బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన వైసిపి బహిరంగ సభ

ప్రజాశక్తి- పొందూరు

పట్టణంలో ఇంటింటా కొళాయిల శంకుస్థాపన అనంతరం స్థానిక బస్టాండ్ ఆవరణలో బహిరంగ సభను ఏర్పాటు చేయడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. ఉదయం 6గంటల నుంచి సాయంత్రం 4 గంటలు వరకు బస్టాండ్‌లోకి బస్సుల రాకను నిలిపివేశారు. దీంతో అంబేద్కర్ కూడలి నుంచి నేరుగా ప్రధాన రహదారి ద్వారా బస్సుల రాకపోకలు జరిపారు. దీంతో పట్టణం ప్రజలు ప్రయాణాలు సాగించేందుకు లగేజీలు మోసుకుంటూ అంబేద్కర్ కూడలికి రాకపోకలు సాగించారు. ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేసేలా కాంప్లెక్స్ ఆవరణలో సభలు నిర్వహించడమేమిటంటూ పట్టణవాసులు ప్రశ్నిస్తున్నారు.

అర్హత ఉన్న వారిని నియమించాలి

ప్రజాశక్తి- బూర్జ

మండలంలో అన్నంపేట గ్రామంలో అంగన్వాడీ పోస్ట్ కొరకు అన్ని అర్హతలు ఉన్న వ్యక్తినే నియమించాలని అదే గ్రామానికి చెందిన పరిటాల రవి సోమవారం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిని గీతారాణికి వినితపత్రం అందజేశారు. పోస్టులకు సంబంధించి అధికారులు, రాజకీయ వ్యక్తులకు ఇతర ప్రలోభాలకు లోనవ్వకుండా నిష్పక్షపాతంగా అర్హులైన వారికే అంగన్వాడీ, ఆయా పోస్టులు ఎంపిక చేసి నియమించాలని కోరారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకున్నప్పటికీ కేవలం రాజకీయ నాయకుల సిఫార్సులకు తలొగ్గొద్దని కోరారు.

'గోరుముద్ద' పరిశీలన

నందిగాం : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంలో నిర్లక్ష్యం వహించవద్దని ఎంఇఒ అన్నుపురం చిన్నారావు సూచించారు. మండలంలోని లఖిదాసుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అమలవుతున్న జగనన్న గోరుముద్ద పథకాన్ని సోమవారం పరిశీలించారు. మెనూ అమలుపై వంట కార్మికులను అడిగి తెలుసుకున్నారు. పంట పదార్థాలను రుచి చూసి తెలుసుకున్నారు. ఈయన వెంట ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు బాలక రామారావు, రంకిడి రామారావు ఉన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీ సిబ్బంది

అంగన్వాడీలకు అవగాహన

ప్రజాశక్తి- ఆమదాలవలస

భేటీ బచావో బేటి పడావోపై అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులకు ఐసిడిఎస్ కార్యాలయంలో సిడిపిఒ ఎస్.గీత ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో బాలల సంరక్షణ కమిటీలను ఏర్పాటు చేయాలని, బాల్య వివాహాలపై నిఘా పెంచాలని సిబ్బందికి సూచించారు. బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో మహిళా సంరక్షణ కార్యదర్శులకు, అంగన్వాడీ కార్యకర్తలకు బాల్య వివాహాలు, ఫోక్సో చట్టం, దత్తత, భేటీ బచావో, బేటి పడావో తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ చేపట్టి ప్రతిజ్ఞ చేయించారు. గ్రామాల్లో బాల్యవివాహాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో లీగల్ కమ్ ప్రొబేషన్ ఆఫీసర్ టి.లక్ష్మణరావు, సోషల్ వర్కర్ జనార్ధన్, సింగూరు శ్రీనివాసరావు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పప్పల లక్ష్మి, బ్లాక్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ నీరజ పాల్గొన్నారు.

పలాస: బాల్య వివాహాలను అరికడదామని ఎంపిడిఒ రమేష్‌నాయుడు అన్నారు. ఎంపిడిఒ కార్యాలయంలో బాల్యవివాహాల అరికట్టే కమిటీని సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాల్యవివాహాలు అరికట్టాల్సిన బాధ్యత ప్రజలందరికీ ఉందన్నారు. రెంటికోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సునీల్ కుమార్ మాట్లాడుతూ బాల్య వివాహాలు చేస్తే అనారోగ్య సమస్యలు వస్తాయని అన్నారు. సిడిపిఒ డి.శార్వాణి మాట్లాడుతూ మీ పరిధిలో బాల్య వివాహాలు జరిగినట్లయితే తమ దృష్టికి తీసుకొస్తే... తగు చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు సరస్వతి, లత, ధనలక్ష్మి, దానమ్మ, అరుణమ్మ, ఎన్‌జిఒస్ అధ్యక్షులు బోనెల గోపాల్, ఎటిడబ్ల్యు శ్రీనివాస్ పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న పిఆర్‌వి శివరామకృష్ణ

సెక్రటరీ కోర్సుతో ఉపాధి అవకాశాలు

ఐసిఎస్‌ఐ ఇఒ పిఆర్‌వి శివరామకృష్ణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం

కంపెనీ సెక్రటరీ కోర్సు అభ్యసించిన వారికి ఉపాధి అవకాశాలు ఎక్కువగా వస్తాయని విశాఖ ఐసిఎస్ఐ కార్యనిర్వహణ అధికారి పిఆర్‌వి శివరామకృష్ణ అన్నారు. శ్రీకాకుళం నగరంలోని పభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో వాణిజ్యశాఖ ఆధ్వర్యాన్న కంపెనీ సెక్రటరీ కోర్స్‌పై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కోర్సు చేయడం ద్వారా ఒనగూరే ప్రయోజనాలు, ఉపాధి అవకాశాలు విద్యార్థినులకు వివరించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె సూర్యచంద్రరావు కంపెనీ సెక్రటరీ కోర్సు ప్రాధాన్యతను తెలిపారు. వాణిజ్య శాస్త్ర విభాగ అధిపతి ఎల్. కష్ణారావు మాట్లాడుతూ సిఎ, ఐ సి డబ్ల్యూ కోర్సులతో పాటు కంపెనీ సెక్రటరీ కోర్సు చేయటం వల్ల అధిక ప్యాకేజీలతో కూడిన ఉద్యోగాలు పొందడానికి ఈ కోర్సు ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ పైడి .శంకర్ నారాయణగారు, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్. పద్మావతి,అకాడమీక్ కోఆర్డినేటర్ చింతాడ. కష్ణారావు, కామర్స్ అధ్యాపకులు కె .లలితాబాయి, సంతోషి పట్నాయక్, పావని,అర్థశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ బి ప్రభాకర రావు కళాశాల అధ్యాపకులు విద్యార్థినులు పాల్గొన్నారు


బోరును ప్రారంభించిన విశ్వక్సేన్

బోరు వేయించిన జనసేన నాయకులు

ప్రజాశక్తి- జి.సిగడాం

మండలం గంగన్నదొర పాలెం గ్రామంలో తాగునీరు సమస్య ఎక్కువగా ఉండడం, రామాలయం నిర్మించడానికి నీరు లేకపోవడంతో చాలా ఇబ్బందిగా ఉందని గ్రామ ప్రజలు ఎచ్చెర్ల నియోజకవర్గ జనసేన నాయకులు, రాష్ట్ర కార్యనిర్వహణ వైస్ ప్రెసిడెంట్ డా.విశ్వక్సేన్‌కు తెలిపారు. వెంటనే స్పందించిన ఆయన బోర్ తవ్వించి సోమవారం బోర్‌ను ప్రారంభించారు. గ్రామ ప్రజలకు నీరు అందడంతో హర్షభావాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు మీసాల రవికుమార్, దుర్గారావు, గొర్లె సూర్య, బలరాం, కాకర్ల బాబాజీ, సింహాచలం, అప్పలనాయుడు, శ్రీను, అప్పన్న, రాము, అవినాష్, జనసైనికులు, నాయకులు పాల్గొన్నారు.

రోగులకు పళ్లు పంపిణీ

పలాస : యువజన దినోత్సవం సందర్భంగా సోమవారం పలాస సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యాన పలాస-కాశీబుగ్గ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న రోగులకు పళ్లు, రొట్టెలు సోమవారం పంపిణీ చేశారు. అలాగే తాళభద్ర భజన మండలి ఆధ్వర్యాన ప్రాణదాత బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో మెగా రక్తదాన శిబిరం నిర్వహించినట్లు యూత్ ఇన్చార్జ్ రవికుమార్ తెలిపారు. ఈ శిబిరంలో 30 మంది పాల్గొన్న రక్తదానం చేశారని అన్నారు. కార్యక్రమంలో జిల్లా సాధన శిబిరం ఇన్‌ఛార్జి జామి చిరంజీవి, శ్రీనివాసరావు, తాళభద్ర కన్వీనర్ శ్రీనివాస్, కూర్మారావు, వెంకటరమణ, ఈశ్వరరావు, డాక్టర్ పాడి, పలాస యూత్ నాయకులు కృష్ణవంశీ, రాజేష్, కృష్ణ పాల్గొన్నారు.

ఇంటింటికీ కుళాయిలు

టెక్కలి : ఇంటింటికీ కుళాయిల ద్వారా తాగునీరు అందిస్తామని సర్పంచ్ బగాది హరి అన్నారు. మండలంలోని కాంట్రగడల సోమవారం ఇంటింటికీ తాగునీటి కుళాయిని ప్రారంభించారు. కార్యక్రమంలో బల్లి ఢిల్లేశ్వరరావు, నంబాళ్ల జనార్థన్, గున్న దేవకీనందన పాల్గొన్నారు.

ఎపికి జగన్ ఎందుకు కావాలంటే...


మెళియాపుట్టి : జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

మెళియాపుట్టి : మండలంలోని పట్టుపురం సచివాలయం పరిధిలో ఎపికి జగన్ ఎందుకు కావాలి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే రెడ్డి శాంతి వైసిపి పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈ నాలుగున్నరేళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. ఆర్‌బికెల ద్వారా నాణ్యమైన విత్తనాలు, వ్యవసాయ యాంత్రీకరణలు పంపిణీ చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి బైపోతు ఉదయ్‌కుమార్, పిఎసిఎస్ అధ్యక్షులు ఉర్లాన బాలరాజు, వైసిపి మండల పార్టీ కన్వీనర్ పల్లి యోగి, సర్పంచ్ ఎస్.లక్ష్మి, కరణం శశిభూషణరావు, శ్రీనివాసరావు, ఎంపిడిఒ పి.చంద్రకుమారి, ఇఒపిఆర్‌డి తారకేశ్వరి, ఎపిఎం లలిత పాల్గొన్నారు.

అలాగే గిరిశిఖరం గ్రామమైన కేరాసింగి సచివాలయంలో పరిధిలో వైసిపి జిల్లా కోశాధికారి లోతుగడ్డ తులసీవరప్రసాద్ ఆధ్వర్యాన జగనే ఎందుకు రావాలి కార్యక్రమాన్ని నిర్వహించి పోస్టర్లను అందజేశారు. కార్యక్రమంలో రెట్టిని సర్పంచ్ శ్యామలబాబు, శ్రీనివాసరావు, పాడి వెంకటేష్, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : సిఎం జగన్మోహన్‌రెడ్డి ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. ఈ మేరకు ధర్మపురం గ్రామ సచివాలయంలో జగనే ఎందుకు సిఎం కావాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే సాయంత్రం మున్సిపల్ చైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మి అధ్యక్షతన పేటలో కూడా జగనే ఎందుకు సిఎం కావాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరెడ్డి, ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పడ నారాయణమ్మ, పిఎసిఎస్ అధ్యక్షులు నర్తు నరేంద్ర యాదవ్, మండల పార్టీ అధ్యక్షులు పాతిర్ల రాజశేఖర్‌రెడ్డి, కారంగి మోహనరావు, దక్కత నూకయ్యరెడ్డి, ఇసురు తులసీరామ్, సర్పంచ్ ప్రతినిధి బాలరాజు, రంపత్ని చిట్టిబాబు పాల్గొన్నారు.

కవిటి: మండలంలోని మాణిక్యపురంలో జగనే ఎందుకు సిఎం కావాలి అనే కార్యక్రమంలో జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్, పిఎసిఎస్ అధ్యక్షులు దేవరాజు సాహు, సర్పంచ్ లలితా సాహు, ఎంపిటిసి సత్యవతిసాహు, ఇఒపిఆర్‌డి శివాజీపాణిగ్రాహి పాల్గొన్నారు.

నందిగాం : మండలంలోని పెద్దలవునిపల్లిలో సర్పంచ్ అట్టాడ శ్రీనివాస్ అధ్యక్షతన ఎపికి జగన్ ఎందుకు సిఎం కావాలి కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి, మండల పార్టీ అధ్యక్షులు తమిరి ఫాల్గుణరావు, జెసిఎస్ మండల కన్వీనర్ జడ్యాడ జయరాం, ఎంపిటిసి పూడి ఆశారాణి, సర్పంచ్‌లు పోలాకి మోహనరావు, కణితి నారాయణమూర్తి, కోనారి రామారావు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలంలోని కిష్టుపురం పంచాయతీలో ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, వైసిపి మండల


ఆమదాలవలస : బ్యాగులను అందజేస్తున్న శ్రీనివాసరావు

పార్టీ అధ్యక్షులు నూక సత్యరాజు ఆధ్వర్యాన జగనే ఎందుకు రావాలని కార్యాక్రమాన్ని నిర్వహించారు. అంతకుముందు ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపతిరావు హేమసుందరాజు, సర్పంచ్ బొడ్డు వెంకటరమణ, ఎంపిటిసి చెంచులు వైసిపి జెండాను, సంక్షేమ పథకాల బోర్డును అవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి దక్క రోజా, జెఎస్‌సి కన్వీనర్ గడ్డవలస నాగభూషణరావు, కవిటి రామరాజు, పేడాడ వెంకటరావు, మెట్ట సింహాచలం, కోతి చిన్నారావు, తర్ర రమణ పాల్గొన్నారు.

ఆమదాలవలస : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తోనే సంక్షేమ పథకాలు సాధ్యమని పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కట్యాచార్యులపేట సచివాలయం వద్ద వై ఎపి నీడ్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ముద్రించి పోస్టర్లను అందజేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎస్.వాసుదేవరావు, ఇఒపిఆర్‌డి దుంపల గోవిందరావు, మండల సచివాలయాల కన్వీనర్ బొడ్డేపల్లి నిరంజన్, సర్పంచ్ ఎన్ని రామచంద్రరావు, వెదుర్లవలస మాజీ సర్పంచ్ బాలా రామారావు పాల్గొన్నారు.


పొందూరు : పత్రాలను పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

బాబుతోనే రాష్ట్ర భవిష్యత్

ప్రజాశక్తి- టెక్కలి

తెలుగుదేశం పార్టీ అధినేత నారాచంద్రబాబునాయుడు పాలన ద్వారానే రాష్ట్రానికి భవిష్యత్ అని టిడిపి మండల పార్టీ అధ్యక్షులు బగాది శేషగిరి అన్నారు. మండలంలోని తేలినీలాపురంలో బాబు షూ్యటీరి-భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు టిడిపి మేనిఫోస్టోతో ముద్రించిన పోస్టర్లను అందజేశారు. కార్యక్రమలో టిడిపి నాయకులు హనుమంతు రామకృష్ణ, మెండ రాజారావు, మహిళా అధ్యక్షులు మెండ దమయంతి, ఇప్పిలి జగదీష్, పేడాడ రాజారావు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి : మండలంలోని హరిశ్చంద్రపురం పంచాయతీలో తెలుగు యువత మహిళా అధ్యక్షులు పూజారి శైలజ, ప్రతినిధి సత్యనారాయణలు బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు ఇంటింటికీ వెళ్లి టిడిపి మేనిఫోస్టోను వివరించారు.

పొందూరు: మండలం లోలుగు గ్రామంలో టిడిపి మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహనరావు ఆధ్వర్యంలో సోమవారం బాబు ష్యూరిటీ...భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే చేపట్టనున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ ఇంటింటా కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా తెలుగుయువత ప్రధాన కార్యదర్శి బలగ శంకర భాస్కరరావు, టిడిపి నాయకులు జోగినాయుడు, సింహాద్రినాయుడు పాల్గొన్నారు.

ఆమదాలవలస : మండలంలోని కనుగులవలస గ్రామంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు నూకరాజు


ఆమదాలవలస : పత్రాలను పంపిణీ చేస్తున్న నాయకులు

ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. అలాగే అక్కులపేట గ్రామంలో సర్పంచ్ బొడ్డేపల్లి గౌరీపతి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ పరిధిలోని 9, 10, 11 వార్డుల్లో టిడిపి నాయకులు రాడ విజయ్ కుమార్, నాగళ్ల మురళీధర్, చౌదాల గోవిందరావు, బరాటం వైకుంఠరావు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న వాకర్స్

ఫెన్సింగ్ నిర్మాణ పనులు అభ్యంతరకరం

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ కెటి రోడ్డు సమీపంలోని ముత్యాలమ్మ కోనేరు (నెహ్రూ పార్కు)లో చేపట్టిన పెన్సింగ్ నిర్మాణ పనులు అభ్యంతరకరంగా ఉన్నాయని, చెరువుకు సంబంధించి కొంత భూమిని విడిచి పెట్టి నిర్మాణ పనులు చేపడుతున్నారని, దీనిపై దృష్టిసారించాలని వాకర్సు సంఘం అధ్యక్షులు డాక్టర్ దువ్వాడ జీవితేశ్వరరావు కోరారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్‌ను సోమవారం కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దక్షిణ, తూర్పు దిక్కుల పార్కు హద్దు స్థలం పక్క ఉన్న వారి పొలాల్లో పార్కు స్థలం కలిసిపోయే విధంగా కంచె నిర్మిస్తున్నారని అన్నారు. 800 అడుగల పొడవు, 30 నుంచి 40 అడుగుల వెడల్పున పార్కు స్థలం విడిచి పెట్టి పక్క వారికి లాభం చేకూరే విధంగా ఏర్పాటు చేస్తున్నారని అన్నారు. తక్షణమే కంచె నిర్మాణం నిలిపి వేసి ఇప్పటికీ చెక్కు చెరదకుండా ఉన్న పాత హద్దు ప్రకారం కంచె ఏర్పాటు చేయాలని కోరారు. 2003లో రెవెన్యూ, మున్సిపల్ శాఖాధికారులు పార్కు చుట్టూ 2 అడుగుల స్థలం విడిచి పెట్టి శాశ్వత నిర్మాణం చేపట్టారని గుర్తు చేశారు. ప్రస్తుతం శాశత హద్దుల ప్రకారం కంచె ఏర్పాట్లు చేయాలని, పార్కులో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టే ముందు వాకర్సుతో భాగస్వామ్యం చేయాలని కోరారు. గతంలో పార్కు అభివృద్ధి పేరున దారి మళ్లీన రూ.77 లక్షల ప్రజాధనం, కరోనా సమయంలో బ్లీచింగ్ పౌడర్ పేరుతో అప్పటి నాయకులు కొల్లగొట్టిన ప్రజాధనాన్ని రికవరీ చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో రాముపాత్రో, సాసుమాను శ్యామసుందరరావులు ఉన్నారు.

రేషన్ వాహనాలపై మోడీ ఫొటో పెట్టాలి

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

రాష్ట్ర ప్రజలకు ఉచిత బియ్యం ఇస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఫోటోను రేషన్ వ్యాన్లపై వెంటనే చేర్చాలని బిజెపి జిల్లా యువ మోర్చా ప్రధాన కార్యదర్శి మన్నె శ్యామ్ కుమార్ డిమాండ్ చేసారు. బిజెవైఎం ఆధ్వర్యంలో తహశీల్దార్లకు మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్టంలో వైసిపి ప్రభుత్వం కేంద్రం ఇస్తున్న పథకాలను వారు ఇస్తున్నట్లు వ్యవహరిస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రెడ్డి ఆనంద్, రాష్ట్ర నాయకులు దుక్క ఆదినారాయణ, దన్నాన రాజేంద్ర, ఎస్‌సి మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి కురియబాబు, మండల కార్యదర్శి అప్పలరాజు, మండల సోషల్ మీడియా కన్వీనర్ బొల్లు రమేష్ పాల్గొన్నారు.

లావేరు: ప్రభుత్వం అందజేస్తున్న ఉచిత రేషన్ బియ్యం వాహనాలపై పిఎం మోదీ ఫోటోలు ముద్రిం చాలని శ్యామ్‌కుమార్ ఆధ్వర్యంలో లావేరు తహశీల్దార్ ఎస్.దిలీప్ చక్రవర్తికి వినతి పత్రాన్ని అందజేశారు.

పాఠశాలలకు వంటపాత్రల పంపిణీ

ప్రజాశక్తి- రణస్థలం

రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థలో అనేక నూతన మార్పులకు శ్రీకారం చుట్టిందని ఎంపిపి ప్రతినిధి, వైసిపి నాయకులు పిన్నింటి సాయికుమార్, జెడ్‌పిటిసి టొంపల సీతారాం అన్నారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న గోరుముద్ద కార్యక్రమంలో భాగంగా ప్రతి పాఠశాలకు విద్యార్థుల సంఖ్య పెరగడంతో మండలంలో 108 ప్రభుత్వ పాఠశాలలకు నాణ్యమైన వంటపాత్రలను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడంతో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఆర్.వి.రమణమూర్తి, ఎంఇఒ త్రినాథరావు, సివిల్ సప్లై డిటి హేమసుందర్, ఎంఇఒ-2 బోనెల లావణ్య, మండల ఎఒ ధనుంజయరావు, సిఆర్‌పి శ్రీనువాస్, వైసిపి మండల పార్టీ అధ్యక్షులు మహంతి పెదరామునాయుడు, ఎఫ్ఎస్‌సిఎస్ అధ్యక్షులు కిల్లారి రమణ, జెఆర్ పురం సర్పంచ్ బవిరి రమణ, ఎంపిటిసి పచ్చిగుళ్ళ సాయిరాం పాల్గొన్నారు.


వంటపాత్రలను పంపిణీ చేస్తున్న నాయకులు

ఉద్యమాలతోనే సమస్యల పరిష్కారం


మాట్లాడుతున్న వరప్రసాద్

కవిటి: తమ సమస్యల పరిష్కారానికి ఉద్యమమే శరణ్యమని ఎపిటిఎఫ్ పూర్వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ప్రఖ్యాత విశ్లేషకుడు పి.వరప్రసాద్ అభిప్రాయపడ్డారు. మండలంలోని బొరివంకలో ఎపి టీచర్స్ ఫెడరేషన్ మండలశాఖ సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగులపై ప్రభుత్వం అనుసరిస్తున్న దుర్మార్గ విధానాలను ఎదుర్కోవడానికి ఉద్యమం ఒకటే శరణ్యమని పిలుపునిచ్చారు. ఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టిన జిపిఎస్ విధానానికి తమ పూర్తి వ్యతిరేకమని స్పష్టం చేశారు. సిపిఎస్ విధానంలో ఈ ఆర్థిక సంవత్సరం ఉద్యోగుల వాటాను తక్షణమే వారి ప్రాన్ ఖాతాలో జమ చేసి, ఉద్యోగులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. మరోవైపు విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ విధానాల వల్ల విద్యా వ్యవస్థ నిర్వీర్యమైందని ఆరోపించారు. దీనిపై పూర్తిస్థాయిలో దృష్టి సారించి ఐక్య పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.వి.అనిల్ కుమార్, జిల్లా అధ్యక్షుడు ఎల్.కరుణాకర్, జిల్లా కార్యదర్శి ఎస్.చాణిక్య, రాష్ట్ర కౌన్సిలర్ జి.రాజేష్ కుమార్, ఆర్.కృష్ణారావు, పి.సతీష్‌కుమార్, డి.గోవిందరావు, ఎం.వంశీ పాల్గొన్నారు.


నేత్రాలను తనిఖీ చేస్తున్న హైందవి

150 మందికి నేత్ర వైద్య పరీక్షలు

మెళియాపుట్టి : మెళియాపుట్టిలోని నలంద పాఠశాలలో సోమవారం ఎల్‌వి ప్రసాద్ కంటి ఆస్పత్రి ఆప్తమి టెక్నీషియన్ డి.హైందవి ఆధ్వర్యాన నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ మేరకు 150 మందికి వైద్య తనిఖీలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు ఇచ్చి తగు సూచనలు అందించారు. కార్యక్రమంలో నలంద ప్రిన్సిపాల్ జె.జె.ప్రతాప్, ఉపాధ్యాయులు ధర్మారావు, మురళి, భాస్కరరావు, పాడి, పోలాకి శారద, నమీనా పాల్గొన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

కొత్తూరు : మండలంలోని గూనభద్రకు చెందిన తర్ర వెంకటరావు, వజ్రగడ్డ శంకరరావు, లంకవలస చందరరావు, బూరగాన హరి, లంకవలస ధర్మారావు, వంబరవల్లి సింహాద్రి, లంకవలస ఉమామహేశ్వరరావు, లంకవలస సింహాచలం, లంకవలస బుచ్చిబాబు, పాము శంకరరావు, లోకలాపు బాబురావు, లోకలాపు హరీష్, గంగు అప్పారావుతో పాటు 90 కుటుంబాలు టిడిపిలో చేరారు. వీరికి టిడిపి నాయకులు, పారిశ్రామిక వేత్త మామిడి గోవిందరావు సోమవారం టిడిపి కండువ వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రతి కార్యకర్తకూ టిడిపి అండగా ఉంటుందని అన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం

ఇచ్ఛాపురం : మున్సిపాలిటీ పరిధిలో చేపట్టుతున్న అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని చైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మి అధికారులను ఆదేశించారు. 11 వార్డు జాలారివీధిలో రూ.75 వేలు అంచనా వ్యయంతో కాలువ నిర్మాణ పనులకు సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో కమిషనర్ నల్లి రమేష్, వార్డు కౌన్సిలర్ ఆశి లీలారాణి, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ కామేష్ పాల్గొన్నారు.

గొరిబందలో గ్రీవెన్స్

పర్లాకిమిడి : గజపతి జిల్లా కాశీనగర్ సమితి గొరిబంధలో కలెక్టర్ సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ మేరకు ప్రజా సమస్యల పరిష్కారానికి వారి వద్ద నుంచి వినతులను స్వీకరించారు. కరువు ప్రాంతంగా గుర్తించాలని కోరుతూ సియాలి సర్పంచ్ రాంప్రసాద్ పట్నాయక్ వినతిపత్రం అందజేశారు. పెద్దమడి, పులిగుమ్మిల వద్ద డైవర్షన్ వేర్ నిర్మించి, ఆ ప్రాంత వ్యవసాయ భూములకు నీటి సదుపాయం కల్పించాలని కోరారు. వ్యవసాయానికి అనువైన సుమారు 70 చెరువులు ఉన్నాయని, వాటి మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని కోరారు.


పాడైన పంటలను పరిశీలిస్తున్న అధికారులు

పాడైన పంటలు పరిశీలన

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని పలాసపురంలో వరి పంట పొలాలను వ్యవసాయశాఖ అధికారులు సోమవారం పరిశీలించారు. ఎన్ఎస్ఎస్ఒ సురేష్, ఎఎస్ఒ రమ్య, ఎఒ నరసింహమూర్తి తదితరులు బృందం స్థానిక రైతులను కలసి పంట నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పంట దిగుబడిలపై కలిగే ప్రభావం గురించి వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ తడక జోగారావు, రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు ప్రోత్సాహం

ప్రజాశక్తి- కంచిలి

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేసి, అవి పండించే రైతులను ప్రోత్సహించాలని మండల ఎఒ ధనుంజయరావు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఉత్పత్తులను సోమవారం విక్రయించారు. ప్రతి సోమ, శనివారాల్లో ప్రకృతి వ్యవసాయం ద్వారా మండల పరిధిలో రైతులు పండించిన ఉత్పత్తులను విక్రయిస్తామని చెప్పారు. స్థానికులంతా కొనుగోలు చేసి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీనివాస్‌రెడ్డి సిబ్బంది శివాజీ, సూర్యనారాయణ, శ్రీనివాసరావు, కుమారి, రాణి పాల్గొన్నారు.


గెలుపొందిన విద్యార్థులతో న్యాయవాదులు

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

కోటబొమ్మాళి : విద్యార్థులు మంచిమార్గంలో పయనించి బాగా చదువుకొని తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు ప్రఖ్యాతలను తీసుకురావాలని న్యాయవాదుల సంఘం అధ్యక్షులు డి.నరసింహమూర్తి అన్నారు. స్థానిక జూనియర్ కోర్టు సివిల్ జడ్జి అదేశాల మేరకు అంతర్జాతీయ బాలల దినోత్సవంలో భాగంగా ప్రకాశనగర్ కాలనీలోని బిసి మండల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు అర్జునరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు హెచ్.ఆనందరావు, ఉపాధ్యాయులు సూర్యనారాయణ పాల్గొన్నారు.